మౌలిక సదుపాయాల్లో మేటి

- అభివృద్ధి పథంలో 49వ వార్డు
- చురుగ్గా రోడ్లు, కాలువల పనులు



సామాజిక భవనంపై షెడ్ నిర్మాణం



49వ వార్డు సత్యానగర్‌లో నిర్మిస్తున్న కాలువలు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు.. ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక సదుపాలయాల కల్పనలో మేటిగా నిలుస్తోంది. ఎక్కడ చూసినా అద్దం లాంటి రహదారులతో మెరిసిపోతోంది. వార్డులోని మురికి వాడలన్నింటినీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండగా.. మరికొన్ని టెండర్ ప్రక్రియ పూర్తయి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పక్కా డ్రైనేజీ సిస్టం

వార్డులోని సత్యానగర్-1లో రూ.36.50 లక్షలతో బీఆర్‌సీసీఎస్‌డబ్ల్యూ డ్రెయిన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో 220 మీటర్ల నిడివి కలిగిన కాలువలు నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో బాటం కాంక్రీటుతోపాటు రెండువైపులా ఇనుప ఊచలు, సిమెంటుతో గోడలు నిర్మిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వైపు కాలువ నిర్మాణం పూర్తి కాగా రెండో వైపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇది పూర్తయితే వరద నీరు, వాడుక నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా దిగువకు ప్రవాహ మార్గం ఏర్పడుతుంది.

ఫంక్షన్ హాల్

సూర్యానగర్-1లోని సామాజిక భవనం పైఅంతస్తుపై రూ.7 లక్షలతో ఫంక్షన్లు చేసుకోవడానికి భోజనాల కోసం ప్రత్యేకంగా షెడ్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ప్రత్యేకంగా గది నిర్మాణానికి కలిపి రూ.28 లక్షలు ఖర్చు చేశారు.

రహదారుల నిర్మాణం

పట్టాభిరెడ్డితోట, ఎన్‌జీజీవోస్ కాలనీల్లో రోడ్లు నిర్మించారు. ప్రశాంతి పార్కు, పీఆర్ గార్డెన్స్ క్రాస్ రోడ్లు నిర్మాణం పనులు టెండర్ల ఆమోదం జరిగింది. వీటిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయ్యప్పనగర్ రహదారికి రూ.19.80 లక్షలు, 48 బస్ రూట్ రహదారి నుంచి మురళీనగర్‌ను కలిపే రహదారి నిర్మాణానికి రూ.19.70 లక్షలు, మురళీనగర్ రహదారిని కలిపే ప్రాంతంలో బీటీ రోడ్డుకు రూ.19.60 లక్షలు, రవీంద్ర భారతి స్కూల్ లింక్ రోడ్డుకు రూ.19.80 లక్షలు, ఎస్ఎస్‌వీ ప్యారడైజ్ ప్రాంతంలో రహదారికి రూ.19.60 లక్షలు, పీఆర్ గార్డెన్స్ క్రాస్ రోడ్ల నిర్మాణానికి రూ.19.70 లక్షలు, సెయింట్ ఆన్స్ పాఠశాల-విఘ్నేశ్వర అపార్ట్‌మెంట్ ప్రాంతంలో రహదారికి రూ.19.80 లక్షలు, పీఆర్ గార్డెన్స్ సచివాలయం రహదారికి రూ.19.70 లక్షలు, గిరిజాన గర్ సచివాలయం క్రాస్ రోడ్డుకు రూ.19.80 లక్షలు, మురళీనగర్ వివేకానంద మార్గ్ రహదారి నిర్మాణానికి రూ.19.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వీటి టెండర్లు పూర్తయ్యాయి. అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు



వార్డులోని ప్రతి కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే బీటీ రోడ్లు పూర్తయ్యాయి. క్రాస్ రోడ్లు బీటీ రహదార్లుగా నిర్మించేందుకు చర్యలు తీసుకున్నాం. నిధులు మంజూరైన పనులు కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతం చేశాం.

– అల్లు శంకరరావు, కార్పొరేటర్, 49వ వార్డు

మంచి చిత్రాలను ఆదరించాలి



విశాఖ కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: ఇటీవల విడుదలైన మార్టిన్ లూథర్ కింగ్ సినిమాపై సమీక్ష, చిత్రంలో నటించిన విశాఖ కళాకారులకు సత్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హాస్యప్రియ కామిడీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే, సమాజంలో అసమానతలను ఎత్తిచూపుతూ ఆలోచింపజేసే చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ అని పేర్కొన్నారు. ఇటువంటి మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కె.సి.హెచ్.గోపినాయుడు, ఎస్.కె.మదీన(మల్లిక)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరరావు, చిన్నారావు, త్రినాథరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వెంకటరావు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా నిత్యం ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు.

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది రౌడీషీటర్లు గొడవలు సృష్టిస్తున్నారని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీలో జరుగుతున్న పనుల ప్రగతిపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం సమీక్షించారు. వివిధ విభాగాల అధికారులతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో జరగాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాక్ కమిటీ పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు చేపడుతున్న అధికారులు ఆదివారం సైతం పూర్తి స్థాయిలో పని చేశారు. అన్ని విభాగాలను భాగస్వామ్యం చేస్తూ సమన్వయంతో పనిచేయాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమాసుధ, ఆచార్య ఎ.కె.ఎం.పవన్, ఆచార్య విజయమోహన్, ఎన్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, కె.సీతామాణిక్యం, సాల్మన్ బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీ వీడ్ ఆయిల్ స్వాధీనం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వీడ్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. వారికి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం టాస్క్ ఫోర్స్, ఫిఫ్త్ టౌన్ పోలీసులు కలసి నిర్వహించిన దాడుల్లో తిక్కవానిపాలెం వద్ద ఓ ఇంట్లో వీడ్ ఆయిల్‌ను విక్రయించడానికి సిద్ధంగా ఉన్న బద్నాని రామారావు, వి.సోమలింగం, కొర్ర సత్తిబాబు అనే ముగ్గురు వ్యక్తులు అరకు, మాడుగుల నుంచి వీడ్ ఆయిల్‌ను తీసుకొచ్చి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న క్రమంలో పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి ఒక కేజీ వీడ్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం పోలీసులు తెలిపారు.

ఏఎస్‌ఐపై దాడి కేసులో వ్యక్తి కోసం గాలింపు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో ఈ నెల 25న దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమంలో కొంత మంది మద్యం తాగి ఏఎస్‌ఐ శివకృష్ణ విధులకు ఆటంకం కలిగించి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో వెంకట సూర్యనారాయణ కోసం గాలిస్తున్నారు. విజయవాడలో అతడు ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి పయనమైనట్లు సమాచారం.

అల్లూరి వాకర్స్ వైద్య శిబిరం

సీతమ్మధార: అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు రోడ్డులోని నర్సింహరాజు ఇంటి వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.వి.గాంధీ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పక్షవాతం, గుండె జబ్బుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రతి రోజు అరగంట పాటు వాకింగ్ చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. స్థానికులకు బీపీ, సుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి నర్సింహరాజు, ఎస్.సంజీవయ్య, టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పేదలకు అన్నదానం



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న జిల్లెల్లమూడి సేవా సమితి సభ్యులు

మద్దిలపాలెం : జిల్లెల్లమూడి అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. మద్దిలపాలెంతో పాటు, ఈఎన్‌టీ ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పోలా ఉమహేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, కె.ఆదినారాయణ, దత్తి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డయాబెటిస్‌పై గెలుపు



క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న టైప్ వన్ డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు

సీతంపేట: సెంటర్ ఫర్ ఎండోక్రైనాలజీ వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ గోళ్ల, అవ్యాన్ స్కిన్ హెయిర్, లేసర్ క్లినిక్ వైద్యురాలు ఎర్రోజు శ్వేతా మాధవి సంయుక్తంగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల్లో మానసిక ఉల్లాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ఆదివారం అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో డయాబెటీస్‌కేర్ ఇన్ స్పోర్ట్స్ అండ్ ఎక్సర్‌సైజ్ పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులతో క్రికెట్ మ్యాచ్, డయాబెటిస్‌పై అవగాహన సదస్సు, ఉచిత రక్త, న్యూరోపతి పరీక్షల నిర్వహణతోపాటు వ్యాధిగ్రస్తులకు డయాబెటిస్ మేనేజ్‌మెంట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ టైప్ వన్ డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల్లో అవగాహన పెంపొందించేందుకు వారికి క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. టైప్ వన్ వ్యాధిగ్రస్తులు రోజుకు 3 నుంచి 4 సార్లు ఇన్సులిన్ ఇంజక్షన్ల రూపంలో వాడుతుంటారని, వారు ఏదైనా క్రీడల్లో పాల్గొంటే శరీరంలో సుగర్ స్థాయి అసమానంగా తగ్గుతుందన్నారు. డాక్టర్ శ్వేతా మాధవి మాట్లాడుతూ సుగర్ లెవెల్స్ నియంత్రణలోఉండటానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై ఇంటువంటి అవగాహన సదస్సుల వల్ల తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీ విశ్వనాథ్, మైరా మీడియా ఇన్‌చార్జి ఉదయ్ కొల్లి, వంద మందికి పైగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మురళీనగర్: చక్కెర వ్యాధి ఉన్న వారు నియమిత ఆహారం తీసుకోవడంతోపాటు కనీసం వ్యాయామం చేయడం మంచిదని కేర్ ఆస్పత్రి చక్కెర వ్యాధి నిపుణులు డాక్టర్ పి.వేణుమాధవి సూచించారు. సుంకరి ఆల్వార్‌దాస్ 93వ జయంతి సందర్భంగా ఆదివారం మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె స్థానికులకు పలు సూచనలిచ్చారు. సుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవడం, వంటకాల్లో నూనె వాడకం తగ్గించుకోవాలని, సాధ్యమైనంత వరకు వేపుళ్లు, జంక్ ఫుడ్స్‌కు స్వస్తి చెప్పాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ డీఎస్‌వీ వేణి మాట్లాడుతూ చలికాలంలో చర్మం పొడిబారకుండా చూసుకోవాలన్నారు. వైరల్ జ్వరాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు.

174 మందికి వైద్య పరీక్షలు

వైద్య శిబిరంలో 174 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించారు. 102 మందికి గుండె పరీక్షలు(ఈసీజీ) ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వైద్యులను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికను అందించారు. డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఎలక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, చిలకపాటి కష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, సభ్యులు పి.చెల్వరాజ్, వడ్డాది అప్పారావు, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు, కేర్ మేనేజర్ ఆల్బ్రైట్, కోఆర్డినేటర్ రాజు, శ్రీలత, సత్య, సతీష్ శిబిరం నిర్వహణకు సహకరించారు.

రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదే లక్ష్యం



పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సీఈవో ఫరీదా, చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

మహారాణిపేట: మిలియన్ వైఆర్‌సీ (యంగ్ రెడ్ క్రాస్) వలంటీర్ల నమోదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, సీఈవో ఎ.కె.ఫరీదా తెలిపారు. ఆదివారం విశాఖ రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృత పరుస్తామన్నారు. విద్యార్థులు, వలంటీర్లను పెద్ద సంఖ్యలో చేర్చుకుని వారి ద్వారా పేదలకు వివిధ రకాల సేవలందించాలని నిర్ణయించామన్నారు. వీరిందరికీ ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశాఖ జిల్లా చైర్మన్ వై.శివనాగేంద్ర రెడ్డి, కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతినిధులు రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

990వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 990వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులను పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోమని, పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సెక్టార్-2లోని యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్, ఆర్ఎస్ఎస్ నాయకులు కొండపల్లి రామారావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటైంది.

వైవిధ్యం.. విశిష్టం.!

- వినూత్న ప్రాజెక్టులకు ఏయూ శ్రీకారం
- నీటి సంరక్షణకు ప్రత్యేకంగా చెరువు నిర్మాణం
- ఇంకుడు గుంతలు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం ఏర్పాటు
- ప్రత్యేక వాహనంతో కాలుష్య అధ్యయనం



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన చెరువు

ఏయూ క్యాంపస్: నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా తమ అవసరాలకు అనుగుణంగా నీటి వసతులను సమకూర్చుకుంటోంది. మరో వైపు పర్యావరణాన్ని, ప్రకృతిని సంరక్షిస్తూ సమాజానికి ఆదర్శనంగా నిలుస్తోంది. ఈ దిశగా నవ్య ప్రాజెక్టులను రూపకల్పనచేసి చూపుతోంది. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా పలు వైవిధ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తన విశిష్టతను చాటుకుంటోంది. ఇటీవల కాలంలో ఏయూ చేపట్టిన నాలుగు అంశాలు ఎంతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

నీటి సంరక్షణకు చెరువు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తూ కొత్త చెరువును ప్రత్యేకంగా తవ్వించారు. నూతనంగా నిర్మించిన అల్గారిదం భవనానికి ఆనుకుని దీనిని అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ రాతితో గట్టును సైతం నిర్మించారు. గట్టుపై విద్యార్థులు కూర్చుని సేదతీరడానికి ఉపయుక్తంగా సిమెంట్ బెంచీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు ప్రారంభించారు.

వర్షా కాలంలో భవనాలపై పడే నీరు, ఇతర మార్గాల్లో వచ్చే నీటిని దీనిలోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసే సమయంలో దీనిలో పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ఈ చెరువును నిర్మించారు. సమీప ప్రాంతాల వారికి నీటి కొరత రాకుండా, భూగర్భ జలాలు పెరిగేలా ఈ చెరువు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



సేంద్రీయ ఎరువు తయారీ కేంద్రం

సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

వర్సిటీలో ఉన్న చెట్ల నుంచి నిత్యం రాలే ఆకులను ఎరువుగా మార్చడానికి ప్రత్యేకంగా సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏయూ శానిటేషన్ డీన్ కార్యాలయం చేరువలో దీనిని నిర్మించారు. నిత్యం వర్సిటీ పరిసరాల్లో రాలే ఆకులు, ఎండిన చెట్ల వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంపోస్ట్ తయారీ పిట్‌లలో వేసి ఎరువుగా మార్చుతారు. ఈ సేంద్రియ ఎరువును ఏయూలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలు పెంపకానికి వినియోగించనున్నారు.

కాలుష్య అధ్యయన వాహనం



పొల్యూషన్ మానిటరింగ్ వాహనం

ఆంధ్ర విశ్వవిద్యాలయం మీటిరాలజీ, ఓషనోగ్రఫీ విభాగానికి నూతనంగా డీఎస్‌టీ నిధులతో మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మోనిటరింగ్ ఫెసిలిటీని అందుబాటులోకి వచ్చింది. డీఎస్‌టీ ఫిస్ట్ పథకంలో భాగంగా రూ.50 లక్షలతో దీనిని సమకూర్చారు. నగరంలోని విభిన్న ప్రాంతాలలో వాయు కాలుష్యాన్ని గణించడానికి అవసరమైన ఉపకరణాలు ఈ వాహనంలో ఉన్నాయి. విభాగ విద్యార్థులు, పరిశోధకులు విశాఖ నగరంలోని నిర్దిష్ట ప్రాంతాలకు ఈ మొబైల్ వాహనాన్ని తీసుకువెళ్లి వాయు కాలుష్యాన్ని గుర్తించడానికి, సేకరించిన సమాచారం ఆధారంగా విశ్లేషించడం, కచ్చితమైన ఫలితాలను అందించడం చేస్తారు.

భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు



ఇంకుడు గుంత

వర్సిటీలో ఉన్న భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు తవ్వారు. భవనాలపై నుంచి పడే వర్షపు నీటిని ఈ గుంతల్లోకి మళ్లించి భూగర్భ జలాలను పెంచే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. వర్సిటీ పరిసరాలలో పుష్కలంగా భూగర్భ జలాలు ఉండేలా ఈ గుంతలు దోహదపడనున్నాయి. ఫలితంగా వర్సిటీ చుట్టూ ఉన్న ఐదారు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రాంతాలకు సైతం నీటి కొరత రాకుండా, భూగర్భ జలాల శాతం పెరగడానికి ఉపయుక్తంగా నిలవనున్నాయి.

ఉద్యమంలా స్వచ్ఛ భారత్



ఉద్యోగులతో కలసి వ్యర్థాలను తొలగిస్తున్న డాక్టర్ షారోన్ రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోంది. ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, విద్యార్థులు, సిబ్బంది భాగస్వాములు అవుతూ నిత్యం వర్సిటీలో ఒక ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలలో ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్, రంజని గెస్ట్‌హౌస్ ప్రాంగణాలలో శ్రమదానం చేశారు. సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్, వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దే దిశగా పని చేస్తామని షారోన్‌రాజు తెలిపారు.